



'ఉపాధి'కి ప్రణాళిక సిద్ధం

జిల్లాలో రూ.278.91కోట్ల పనులు

- 55.78లక్షల పనిదినాలకు ప్రతిపాదన
- నమోదైన కూలీలు 4.61లక్షలు, పనిచేస్తున్నవారు 2.55లక్షల మంది
- 'ఆత్మీయ భరోసా'తో పెరగనున్న క్రియాశీల కూలీల సంఖ్య

మహబూబాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో వలసలు నివారించి పేదలకు పని కల్పించడమే లక్ష్యంగా అమలు చేస్తున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం(ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్)లో రాబోయే 2025-26 సంవత్సరానికి మహబూబాబాద్ జిల్లా ప్రణాళికను అధికారులు సిద్ధం చేశారు. ఈసారి జిల్లాలో రూ.278.91కోట్ల విలువైన పనులను, 55.78లక్షల పనిదినాలను కల్పించేందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖాధికారులు ప్రతిపాదనలను కేంద్రానికి పంపించారు. 2005, ఆగస్టు 25న జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని నైపుణ్యం లేని వయోజనులకు ప్రతీ గ్రామీణ కుటుంబంలో పనిని కోరిన వారికి ఆ గ్రామ పరిధిలోనే వంద రోజులు పనిదినాలతో కనీస వేతనం వచ్చే విధంగా పని కల్పించాలని చట్టాన్ని చేశారు. ఈ చట్టం ప్రకారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్రంలోని గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నిర్వహిస్తున్నారు. ఇందులో బాగంగా ప్రాథమికంగా పూర్తి నైపుణ్యం లేని, కొద్దిపాటి నైపుణ్యంగల పనులు, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారికి కల్పించడం ద్వారా గ్రామీణ ప్రజల కొనుగోలు శక్తిని పెంపొందింపజేసే లక్ష్యంతో పథకాన్ని అమలు చేస్తున్నారు. ఈ పథకంలో వ్యవసాయాభివృద్ధి కోసం నీటివనరుల సంరక్షణ, మొక్కలు, పండ్ల తోటలు, పశువుల పెంపకం కోసం కొట్టాలు, కోళ్ల షెడ్లు, వర్మీ కంపోస్టు, వానపాముల ఎరువుల తయారీకి తొట్ల నిర్మాణం, బీడు భూములను అభివృద్ధి చేయడం, నీటి నిల్వ, సంరక్షణ కోసం ఇంకుడు గుంతలు, చెరువుల్లో పూడిక, చెక్‌డ్యాంలు, మౌళిక సదుపాయాల్లో భాగంగా మరుగుదొడ్ల నిర్మాణం, అంతర్గత సిమెంటు కాంక్రీట్ రోడ్లు, భవనాల నిర్మాణం తదితర పనులను ఈ పథకంలో 2005 నుంచి చేపడుతున్నారు.

జిల్లాలో 4.61లక్షల మంది..

మహబూబాబాద్‌లో జిల్లాలో ఉపాధి హామీ పథకంలో 2,19,626 జాబ్‌కార్డులు జారీ చేయగా ఇందులో 4,61,288 మంది కూలీలు నమోదై ఉన్నారు. మూడేళ్లలో ఒక్కరోజు పనికి వెళ్లినా జాబ్‌కార్డులు క్రియాశీలకం(యాక్టివ్)గా ఉంటాయి. జిల్లాలో 1,41,220 జాబ్‌కార్డులు క్రియాశీలకంగా ఉంటూ అందులోని 2,55,846 మంది కూలీలు పనులు నిర్వహిస్తున్నారు. పనిచేసే ఉపాధి కూలీల్లో సగానికి(52%)పైగా 1,33,923 మంది మహిళలే ఉండడం గమనార్హం. యాక్టివ్‌లో ఉన్న కూలీల్లో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారు 29,944 మంది ఉండగా ఎస్టీలు 1,24,642 మంది, ఇతరులు 1,01,260 మంది ఉన్నారు. వీరందరికీ ఏడాది కాలంలో 55,78,249 పనిదినాలను కల్పిస్తూ రూ.278.91కోట్ల కూలీ పనులు చేపట్టాలని ప్రణాళికలు అధికారులు రూపొందించారు. ఈ ప్రతిపాదనలు కేంద్రం ఆమోదిస్తే ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి వచ్చే ఏడాది మార్చి 31వరకు ఈ పనులను నిర్వహిస్తారు.

'ఆత్మీయ భరోసా'తో పెరగనున్న కూలీలు...



ఈజీఎస్-జిల్లాలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీల్లో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' పథకం అమలు అవుతుండడంతో ఈ ఏడాది క్రియాశీల కూలీల సంఖ్య గణనీయంగా పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో భూమిలేని కూలీలకు ఏడాదికి రూ.12వేల ఆర్థిక సహాయాన్ని అందిస్తారు. అయితే భూమిలేని కూలీలను గుర్తించేందుకు ఉపాధి హామీ పథకం పనులనే ప్రామాణికంగా తీసుకుంటున్నారు. ఎలాంటి భూమి లేకుండా ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డు ఉన్న కూలీలు కనీసం 20 రోజులు పనులు చేసిన వారికి ఆత్మీయ భరోసా పథకంలో అర్హులుగా గుర్తించారు. దీంతో వచ్చే ఏడాది ఉపాధి హామీ పథకం పనులకు డిమాండ్ పెరిగి మరింత మంది క్రియాశీల కూలీలు పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరోవైపు జిల్లాలో నూతనంగా ఏర్పాటైన కేసముద్రం మునిసిపాలిటీలో ఐదు గ్రామాల్లో ఇక నుంచి ఉపాధి హామీ పనులు ఉండబోవనేది కూలీలకు ప్రతికూలంగా మారింది. ఇది మినహా జాతీయ ఉపాధి హామీ పథకం జిల్లాలోని గ్రామాల్లోని రెండున్నర లక్షల మంది పేద, మధ్య తరగతి వర్గాల కూలీలకు ఆర్థికంగా ఆసరాగా నిలుస్తోందనేది వాస్తవం.



పాకాల ఏటిలో కోళ్ల కళేబరాలు

బయ్యారం శివారు పాకాల నీటిలో తేలియాడుతున్న బాయిలర్ కోళ్ల కళేబరాలు

- గుర్తుతెలియని వ్యక్తులు పడేశారంటూ అనుమానాలు
- బర్డ్‌ఫ్లూ ప్రచారం నేపథ్యంలో ప్రజల్లో ఆందోళన

బయ్యారం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్-ఇల్లందు ప్రధాన రహదారి మార్గమధ్యలోని మహబూబాబాద్ జిల్లా బయ్యారం శివారు పాకాల ఏరులో సోమవారం బాయిలర్ కోళ్ల కళేబరాలు కనిపించడంతో కలకలం రేపింది. కొద్దిరోజులుగా తెలుగు రాష్ట్రాల్లో జోరుగా ప్రచారంలో ఉన్న బర్డ్ ఫ్లూ వైరస్ ఓ పక్క ప్రజలను కలవరపెడుతుండగా మరో పక్క పాకాల ఏరులో కోళ్ల కళేబరాలు దర్శనమివ్వడం ఆందోళనకు గురిచేస్తోంది. తెల్లవారుజామున ఆ మార్గంలో వెళుతున్న పలువురు ఏరులో మృతి చెందిన కోళ్లను చూసి ఫొటోలు తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంతో వైరల్‌గా మారాయి. ఈ కోళ్ల బర్డ్‌ఫ్లూతో చనిపోవడంతోనే పలువురు గుర్తుతెలియని వ్యక్తులు వాటిని ఏరులో పడేసి ఉంటారని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారడంతో పోలీసులు దీనిపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఈ కోళ్లను ఏటిలో ఎవరు వేశారనే విషయంపై విచారణ జరుపుతున్నట్లు సమాచారం. నిన్నమొన్నటి వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే బర్డ్‌ఫ్లూ వైరస్ వ్యాప్తి చెందిందని, తెలంగాణలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పలువురు నెటిజన్లు సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టిన ఈ క్రమంలోనే బ య్యారంలో బాయిలర్ కోళ్ల కళేబరాల అంశం చర్చనీయాంశంగా మారింది. ఇదిలా ఉండగా పాకాల ఏటి నీరు కేవలం సాగునీటికే వినియోగిస్తున్నప్పటికీ బర్డ్ ఫ్లూ వైరస్ భయంతో ప్రజలు ఈ నీటిని వ్యవసాయంలో ఉపయోగించడానికి పలువురు రైతులు సందిగ్ధత వ్యక్తం చేస్తున్నారు. పాకాల ఏటిలో కనిపించిన బాయిలర్ కోళ్లు బర్డ్‌ఫ్లూతో మృతి చెందాయా లేదా ఇతర వ్యాధులతో మృతి చెందాయా అనేది తేలాల్సిఉంది.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి : డీఈవో

తొర్రూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలని మహబూబాబాద్ డీఈవో రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం తొర్రూరులోని కేజీబీవీని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి ఎస్వో, ఉపాధ్యాయులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాల లని సూచించారు. ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తుందని, విద్యార్థులు ఇష్టపడి చదివి లక్ష్యాలు సాధించాలన్నారు. అపార్ నమోదు పెండింగ్ లేకుండా చూడా లన్నారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. విద్యార్థు లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బోధిస్తూ ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో బుచ్చయ్య, స్పెషల్ ఆఫీసర్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వంపై బీఆర్‌ఎస్ కుట్రలు

- ప్రజలందరికీ సంక్షేమ పథకాలు తప్పక అందిస్తాం
- ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచందర్‌నాయక్



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ జాటోత్ రాంచందర్‌నాయక్

కురవి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు బీఆర్‌ఎస్ కుట్రలు చేస్తుందని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచందర్‌నాయక్ అన్నారు. కురవి మండలం మొగిలి చర్లలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన సంవత్సర కాలంలోనే రైతాంగానికి రూ.58 వేల కోట్లు అందించామన్నారు. అర్హులైన ప్రజలందరికి ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు, ఆత్మీయ భరోసా అందించి సంక్షేమ పథకాల పండుగ త్వరలోనే తీసుకువస్తామన్నారు. త్వరలో జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ మద్దతు ఇచ్చిన ఎమ్మెల్సీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. పదో తరగతి, ఇంటర్ పరీక్షల కారణంగా స్థానిక సంస్థల ఎన్నికలు కాస్త ఆలస్యమయ్యాయని, అన్ని ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీసీలకు, ఎస్సీలకు న్యాయం చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి దక్కుతుందన్నారు. ఈ నెల 24న రాష్ట్ర పరిశీలకులు విశ్వనాథం మరిపెడలో ఉదయం 10గంటలకు, మహబూబాబాద్‌లో 2గంటలకు కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారని వెల్లడించారు. ఎంపీ పోరిక బలరాంనాయక్ మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ కుటుంబంపై బండి సంజయ్ వ్యాఖ్యలను ఖండించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేత రామసహాయం సురేందర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు అంబటి వీరభద్రం, బండి వెంకట్‌రెడ్డి, నూకల శ్రీరంగారెడ్డి, బండి శ్రీనివాస్, కోర్ని రవీందర్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్‌నాయక్, గార్లపాటి వెంకట్‌రెడ్డి, రాంలాల్, వద్దుల సురేందర్‌రెడ్డి, మలేడి నరేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



గూడూరు జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాలలో వంట గదిని పరిశీలిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

గూడూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : అన్ని వసతి, సంక్షేమ హాస్టళ్ల, గురుకుల పాఠశాలల్లో మెనూ ప్రకారం విద్యార్థులకు తప్పనిసరిగా భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అధికారులను ఆదేశించారు. గూడూరు మండలం దామరవంచ గిరిజన బాలుర గురుకుల పాఠశాల, గూడూరు జ్యోతి రావుపూలే గురుకుల పాఠశాలను సోమవారం అకస్మీకంగా తనిఖీ చేపట్టారు. ఆయా గురుకులాల్లోని కిచెన్‌షెడ్డు, స్టోర్‌రూం, డైనింగ్‌హాల్, స్టడీ రూపం, మరుగుదొడ్లు, తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు మెనూ పక్కాగా అమలు చేసి రుచి, శుచికరమైన భోజనాన్ని అందించాలన్నారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థుల పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ వహించి ఉత్తమ బోధన చేయాలన్నారు. షెడ్యూల్ ప్రకారం విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయించాలన్నారు. రికార్డుల్లో వ్యక్తిగత వివరాలు, ఆరోగ్య, విద్య విషయాల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ శ్వేత, ఎంపీడీవో వీరస్వామి ఉన్నారు.

- బయ్యారం : సబ్జెక్టుల వారిగా ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ విద్యాప్రమాణాలు పెంపొందించేలా తగిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ఆదేశించారు. బయ్యారం మండలం ఇర్సులాపురం ఆశ్రమ పాఠశాలను సోమవారం రాత్రి కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కిచెన్ షెడ్, స్టోర్ రూమ్, డైనింగ్ హాల్, స్టడీ రూమ్, టాయిలెట్స్, తరగతి గదులతో పాటు పాఠశాల పరిసరాలను పరిశీలించారు. మెనూ ప్రకారం పిల్లలకు పౌష్టికాహారం అందించాలన్నారు. షెడ్యూల్ ప్రకారం వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. వసతి గృహాల పరిసర ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు సానిటేషన్ చేస్తూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మండల వెంకన్న

ఆరు గ్యారంటీల అమలు కోసం పోరాటాలు

- ఎన్డీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మండల వెంకన్న

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరుగ్యారంటీల అమలు కోసం పోరాటాలు నిర్వహి ంచాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు మండల వెంకన్న పిలుపునిచ్చారు. మహబూబాబాద్ మాధవన్ననగర్ కాలనీలో ఈ నెల 20న చలో హైదరాబాద్ పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తాము అధికారంలోకి వస్తే వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్న కాంగ్రెస్ పాలకులు నేటికి 14 నెలలు గడిచిన అమలుకు నోచుకోలేదన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం తప్ప ఏ ఒక్క గ్యారంటీల అమలు కాలేదన్నారు. ఆరుగ్యారంటీల అమలు డిమాండ్‌తో ఈనెల 20న జరుపతలపెట్టిన చలో హైదరాబాద్‌కు భారీగా తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సామ పాపయ్య, బట్టు చైతన్య, తెల్లబోయిన లక్ష్మయ్య, ఏకాంబ్రం, శ్రీను, లచ్చమ్మ, ఉప్పలయ్య, మల్లేశం, సుధాకర్, బాగ్యమ్మ, హైమా, యాకయ్య , కల్యాణి పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించాలి : డీఎంహెచ్‌వో



ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో కంటి పరీక్ష కేంద్రాన్ని సందర్శిస్తున్న డీఎంహెచ్‌వో గుండాల మురళీధర్

నెహ్రూసెంటర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లాలో గతంలో కంటి పరీక్షలు నిర్వహించిన 970 మంది స్కూల్ పిల్లలకు తిరిగి మరోసారి వారికి కంటి పరీక్షలు నిర్వహించాలని డీఎంహెచ్‌వో గుండాల మురళీధర్ అన్నారు. జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సోమవారం కంటి పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు. ఈసందర్భంగా డీఎంహెచ్‌వో మురళీధర్ మాట్లాడుతూ.. కంటి పరీక్షలు నిర్వహించిన తర్వాత ఎవరికైనా సమస్యలు ఉంటే గుర్తించి అవసరమైన కంటి అద్దాలు ఇవ్వాలని సూచించారు. జిల్లాలో రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమంలో వైద్యాధికారులతో పిల్లలందరిని పరీక్షించి కంటిచూపు సమస్య ఉన్న వారిని 102 ఆర్‌బీఎస్‌కే వాహనంలో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని నేత్ర పరీక్ష కేంద్రానికి తీసుకురావాలన్నారు. అధికంగా సమస్య ఉన్న వారికి శస్త్రచికిత్సలు చేయాలన్నారు. వరంగల్ రీజినల్ ఆస్పత్రికి గానీ, హైదరాబాద్ సరోజినిదేవి అస్పత్రికి రెఫర్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అస్పత్రి సూపరింటెంట్ బత్తుల శ్రీనివాసరావు, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ భూక్య వెంకట్రాములు, లకావత్ వెంకట్, రాణాప్రతాప్, శ్రీకుమార్, శ్రీధర్,హర్షవర్ధన్, సుబ్బలక్ష్మి, బాలకృష్ణ, రామకృష్ణ, జ్యోత్స్న, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్



మరిపెడ సర్కిల్ ఆఫీస్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ

మరిపెడ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : పోలీసులు సైబర్ నేరాలపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్‌కేకన్ అన్నారు. సోమవారం ఆయన మరిపెడ పీఎస్, సర్కిల్ ఆఫీస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెండింగ్ కేసులపై ఆరా తీశారు. నేరస్థులపై నిఘా పెట్టాలని సూచించారు. రికార్డులను పరిశీలించారు. లాకప్‌రూం, రిసెప్షన్‌గదిని చెక్ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ పోలీసులను ఉద్దేశించి మాట్లాడారు. అక్రమ ఇసుక రవాణాపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. క్రైంరేట్స్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సీఐ రాజ్‌కుమార్‌గౌడ్, ఎస్సైలు సతీశ్, సంతోశ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.4.92 లక్షల ఎండు గంజాయి పట్టివేత



గంజాయి తరలిస్తూ పట్టుబడిన వ్యక్తుల అరెస్టు చూపుతున్న ఎస్సై గడ్డం ఉమ

డోర్నకల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ మండలం ఉయ్యాలవాడ క్రాస్‌రోడ్డు వద్ద రెండు ద్విచక్రవాహనాలపై తరలిస్తున్న 19 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్టు చేసినట్లు డోర్నకల్ ఎస్సై గడ్డం ఉమ సోమవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిస్సా రాష్ట్రానికి చెందిన సమరభూమియా, మహాదేవ్‌మండల్, ఉమేష్ మండల్, మరో బాలుడితో కలిసి స్వరాష్ట్రం నుంచి గంజాయి తీసుకుని ద్విచక్రవాహనాలపై బయలుదేరారు. గంజాయిని వరంగల్ వైపు తరలిస్తున్న క్రమంలో ఖమ్మం వద్ద పోలీసులను చూసి వారిని తప్పించుకునే క్రమంలో ఉయ్యాలవాడ మీదుగా ద్విచక్రవాహనాలను మళ్లించారు. అదే సమయంలో ఉయ్యాలవాడ క్రాస్‌రోడ్డు వద్ద సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేస్తున్న ఎస్సై గడ్డం ఉమ కంటపడ్డారు. అనుమానం వచ్చిన ఎస్సై సిబ్బందిని అప్రమత్తం చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద సంచులను పరిశీలించగా అందులో గంజాయి ఉన్నట్లు చెప్పారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.4.92 లక్షలు ఉంటుందని చెప్పారు. గంజాయి తరలిస్తున్న వారిని అరెస్టు రిమాండ్‌కు తరలించనున్నట్లు చెప్పారు.



జైళ్ల శాఖ డీజీపీ సౌమ్యమిశ్రాకు ఆలయ చరిత్రను వివరిస్తున్న గైడ్ విజయ్

రామప్పను సందర్శించిన
జైళ్ల శాఖ డీజీపీ

వెంకటాపూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాలంపేట గ్రామంలో గల యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని తెలంగాణ రాష్ట్ర జైళ్ల శాఖ డీజీపీ సౌమ్యమిశ్రా సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, ఉద్యోగులు ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్న సౌమ్యమిశ్రా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె ఆలయ శిల్పకళా సౌందర్యాన్ని వీక్షించి ఆలయ చరిత్ర, విశిష్టతను గైడ్‌ను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి సరస్సు వద్దకు చేరుకుని ప్రకృతి అందాలను తిలకించారు. ఆమె వెంట ములుగు పోలీస్ అధికారులు, సిబ్బంది ఉన్నారు. అదేవిధంగా ఇంగ్లండ్ దేశస్థులు రామలింగేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ శిల్పకళను కనులారావీక్షించి తమ కెమెరాల్లో బంధించుకున్నారు.

ఘనంగా
ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ



కోదండ రామాలయంలో ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ చేయిస్తున్న అర్చకులు గోపి

గోవిందరావుపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని కోదండ రామాలయంలో సోమవారం ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ కార్యక్రమం ప్రధాన అర్చకులు గోపి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఉదయం 8.19 గంటలకు భక్తుల రామనామస్మరణతో ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించిన అనంతరం సీతారామచంద్రస్వామి కల్యాణం జరిపించారు. ధ్వజస్తంభ దాతలు తాతినేని పిచ్చేశ్వరరావు-సునంద, మాచినేని సాంబశివరావు-సరోజన, సూది లక్ష్మారెడ్డి-స్వప్న దంపతులు హోమం కార్యక్రమంలో పాల్గొన్నారు. మధ్యాహ్నం మహా అన్నదానం నిర్వహించగా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు మాచినేని బాబురావు, ఆలయ కమిటీ అధ్యక్షుడు కొమ్మరాజు సత్యనారాయణతోపాటు భక్తులు పాల్గొన్నారు.

భాగ్యతండాలో కేసీఆర్ జన్మదిన వేడుకలు

- 'కల్యాణలక్ష్మి'కి స్ఫూర్తినిచ్చిన కీమానాయక్ కుటుంబంతో కలిసి సంబురాలు
- మహిళలకు చీరలు పంపిణీ చేసిన బీఆర్ఎస్ నాయకులు
- జ్ఞాపకాలను నెమరేసుకున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

ములుగు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : కల్యాణలక్ష్మి పథకం పురుడుపోసుకున్న ములుగు జిల్లా ములుగు మండలం భాగ్యతండాలో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జన్మదిన వేడుకలను సోమవారం ఆ పార్టీ నాయకులు ఘనంగా జరిపారు. పథకానికి స్ఫూర్తినిచ్చిన కీమానాయక్ కుటుంబ సభ్యుల సమక్షంలో సంబరాలు చేసుకున్నారు. ఆడబిడ్డల పెళ్లి పేద తల్లిదండ్రులకు భారంగా మారకూడదనే లక్ష్యంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ కల్యాణలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టగా.. అన్నివర్గాల మన్ననలు అందుకున్న విషయం తెలిసిందే. 2002లో భాగ్యతండాలో జరిగిన ఓ సంఘటనను స్ఫూర్తిగా తీసుకొని ఈ పథకానికి రూపకల్పన చేసినట్లు కేసీఆర్ పలు వేదికలపై చెప్పారు. ఆనాడు కేసీఆర్ వెంట ఉన్న నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆ సందర్భాన్ని గుర్తుచేసుకున్నారు. తండాలో అగ్నిప్రమాదం జరగ్గా 20కిపైగా ఇళ్లు కాలిపోగా.. బుజ్జి-కీమానాయక్ దంపతులు తమ కుమార్తె కల్పన వివాహం కోసం దాచుకున్న డబ్బులు, బంగారం, పెళ్లిబట్టలు సర్వం కాలి బూడిదయ్యాయి. విషయం తెలుసుకొని స్వయంగా భాగ్యతండాకువచ్చిన కేసీఆర్ కల్పన వివాహానికి రూ.50 వేల ఆర్థికసాయం చేయడంతోపాటు పెండ్లికి కావాల్సిన సామగ్రిని అందజేశారు. ఈ సంఘటనను స్ఫూర్తిగా తీసుకొని తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై తాను ముఖ్యమంత్రి అయిన తర్వాత కేసీఆర్ కల్యాణలక్ష్మి పథకానికి రూపకల్పన చేశారు. కాగా, కల్పన-యాకూబ్ దంపతులకు ఇద్దరు సంతానం కలగగా వారి కుమార్తె చంద్రకళకు నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తన సొంత ఖర్చులతో గతంలో వివాహం జరిపించారు. అదేరోజు కల్యాణలక్ష్మి సాయాన్ని అందజేశారు. చంద్రకళ ఇటీవల ఆడశిశువుకు జన్మనిచ్చింది. ఇలా మూడు తరాలకు చెందిన ఆడబిడ్డల సమక్షంలో కేసీఆర్ జన్మదిన వేడుకలను జరుపుకోవడం గొప్ప విశేషమని సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఆయన మూలాలను చెరిపివేస్తామని కొందరు కలలుకంటున్నారని, అది వారి అవివేకమన్నారు. ఆడబిడ్డ కడుపులో పడ్డ నాటినుంచి వివాహం వరకు ప్రభుత్వం అండగా నిలిచేలా పథకాలను రూపొందించిన కేసీఆర్ పేద కుటుంబాలను ఆదుకున్నాడని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి అన్నారు. కేసీఆర్‌ను తెలంగాణ సమాజం మర్చిపోదని తెలిపారు. ఈ సందర్భంగా కీమానాయక్, కల్పన, చంద్రకళ దంపతులను సన్మానించడంతోపాటు స్థానిక మహిళలకు చీరెలను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, ములుగు, మల్లంపల్లి మండల అధ్యక్షులు సానికొమ్ము రమేష్‌రెడ్డి, పాలెపు శ్రీనివాస్, ఇతర నాయకులు పాల్గొన్నారు. ఆనాటి ఉద్యమ జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం ములుగులోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో కేక్ కట్‌చేసి మొక్కలు నాటారు. మిర్చి తోటలో పనిచేస్తున్న రైతులు, కూలీలతో కలిసి కేసీఆర్ జన్మదిన వేడుకలు జరుపుకున్నారు.



భాగ్యతండాలో కీమానాయక్ కుటుంబ సభ్యులతో బీఆర్ఎస్ నాయకులు



మహబూబాబాద్ అంబేద్కర్ విగ్రహం ఎదుట యుద్ధభేరి వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఎస్ ఉద్యోగులు

మార్చి 2న ధర్నాచౌక్‌ను
జయప్రదం చేయండి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ధర్నాచౌక్ వద్ద మార్చిన 2న జరిగే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి మోబిన్ అహ్మద్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్ అంబేద్కర్ విగ్రహం ఎదుట సోమవారం సీపీఎస్ ఉద్యోగుల ఆధ్వర్యంలో ధర్నాచౌక్ వద్ద నిర్వహించబోయే కార్యక్రమ యుద్ధభేరి వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయలకు శాపంగా మారిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) విధానాన్ని రద్దు చేసి పాతపెన్షన్ విధానాన్ని పునఃరుద్ధరించాలన్నారు. ఉద్యోగుల పదవీమరణ పొందిన బెనిఫిట్స్ కూడా రాకపోవడంతో ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్డీ, రఫిక్, బత్తుల శ్రీనివాస్, మల్లేష్, సింగు రమేష్, కిషోర్, వెంకట్‌రెడ్డి, స్వరూపరాణి, వీరు నాయక్, వీరలక్ష్మీ, ఝాన్సీ, స్వాతి, డోలి అనిల్‌కుమార్, సత్యనారాయణ, వెంకట్, ఉమాంజలి, అబ్దుల్ సత్తార్, లక్ష్మీ, స్వాతి, అరుణ పాల్గొన్నారు.

భూమి పట్టా చేయించుకుని..
బాగోగులు చూడడం లేదు..

- పెద్దకుమారుడి ఇంటి ఎదుట తల్లి ఆందోళన
- మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలంలో ఘటన



గొల్లచర్లలో కుమారుడి ఇంటి ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కమలమ్మ

డోర్నకల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తన పేరిట ఉన్న భూమిని కొందరు అధికారుల సాయంతో గతంలో అక్రమంగా పట్టా చేయించుకున్న తన పెద్ద కుమారుడు.. తన బాగోగులు చూడటం లేదంటూ ఓ వృద్ధురాలు తన కుమారుడి ఇంటి ఎదుట నిరసన తెలిపింది. ఈ సంఘటన సోమవారం మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం గొల్లచర్లలో జరిగింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం. గొల్లచర్ల గ్రామానికి చెందిన తాటికొండ కమలమ్మకు ముగ్గురు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. వారికి వివాహాలయ్యాయి. ఇక కమలమ్మ భర్త 25 ఏళ్ల క్రితం మృతి చెందగా ముగ్గురు కుమారులకు ఆస్తిపంపకాలు చేశారు. ఆ సమయంలో వారికి మొత్తం 9ఎకరాలు ఉండగా.. కమలమ్మ పేరిట 2.30 గుంటలను ఉంచి.. మిగతా భూమిని అన్నదమ్ములు పంచుకున్నారు. ఆ తర్వాత ఎనిమిదేళ్ల క్రితం తన పెద్దకుమారుడైన మల్లారెడ్డి తన పలుకుబడి, ఆర్థిక స్థోమతను ఉపయోగించి కొందరు రెవెన్యూ అధికారుల సాయంతో తనకు, మిగిలిన ఇద్దరు కుమారులకు తెలియకుండా తనపేరిట ఉన్న 2.30 గుంటల భూమిని కూడా అక్రమంగా పట్టా చేయించుకున్నాడని కమలమ్మ ఆరోపిస్తోంది. ఎనిమిదేళ్లుగా ఈ వివాదం కొనసాగుతుండగా పలుమార్లు పెద్దమనుషుల్లో పంచాయితీలు పెట్టామని, అయినా పెద్దకుమారుడి నుంచి ఎలాంటి స్పందన లేదని, రైతుభరోసా, కౌలు డబ్బు కూడా తానే తీసుకుంటున్నాడని, తన బాగోగులు చూడటం లేదని కమలమ్మ వాపోతోంది. తన కు న్యాయం చేయాలంటూ సోమవారం తన పెద్దకుమారుడు ఇంటి ఎదుట నిరసనకు దిగడం చర్చనీయాంశమైంది.

రామాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

- మొగిలిచర్లకు భారీగా తరలివచ్చిన భక్తజనం
- ప్రభుత్వ విప్ రాంచందర్, ఎంపీ బలరాం ప్రత్యేక పూజలు

కురవి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కురవి మండలం మొగిలిచర్లలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో యంత్రస్థాపన, శిఖర విమాన గోపుర, కలశ ప్రతిష్ఠ పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వేల సంఖ్యలో తరలివచ్చిన భక్తుల శ్రీరామ నామస్మరణ మధ్య వేద పండితులు కండ్లకుంట వేంకట నరసింహచార్యస్వామి చేతుల మీదుగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, సీతారామచంద్రస్వామి విగ్రహాల ప్రాణప్రతిష్ఠ, స్వామి వారి శాంతి కల్యాణాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచందర్‌నాయక్, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, మాజీ ఎంపీ రామసహాయం సురేందర్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో భారీ అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నూకల అనిత-వేణుగోపాల్‌రెడ్డి, అంబటి వీరభద్రం, మాజీ జడ్పీటీసీ బండి వెంకట్‌రెడ్డి, నూకల శ్రీరంగారెడ్డి, గార్లపాటి వెంకట్‌రెడ్డి, వద్దుల సురేందర్‌రెడ్డి, ఇస్లావత్ సుధాకర్‌నాయక్, మలేడి నరేష్, జి.రామచంద్రయ్య, చల్లగొల్ల గణేష్, మింగు సమ్మయ్య, కొర్ని రవీందర్‌రెడ్డి, బండి శ్రీను పాల్గొన్నారు.



మొగిలిచర్లలో సీతారామచంద్రస్వామి ఆలయ ప్రతిష్ఠాపనలో పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్ రాంచందర్‌నాయక్, ఎంపీ బలరాంనాయక్

మిర్చిని మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రవికుమార్

గోవిందరావుపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : మిర్చి పంటకు క్వింటాకు రూ.25వేల మద్దతు ధర నిర్ణయించి నాఫెడ్, మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బండారు రవికుమార్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం జరిగిన పార్టీ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 25వేల ఎకరాల్లో రైతులు మిర్చి సాగు చేశారని, తామరపురుగు, తెగుళ్ల, వాతావరణంలో వస్తున్న మార్పులు, నకిలీ విత్తనాలు, పురుగు మందులు, ఎరువుల నకిలీతో పంటకు తీవ్ర నష్టం చేకూరిందని అన్నారు. మరోవైపు పంటకు సరైన గిట్టుబాటు ధర లేక రైతులు ఆర్థికంగా కుంగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు మార్కెట్ రేట్లపై ప్రభుత్వాలు స్పందించకపోవడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారని అన్నారు. రైతులకు రైతు భరోసా కింద రుణమాఫీ చేసి కొత్త రుణాలు అందించాలని, మిర్చిని ఇతర దేశాలకు ఎక్స్‌పోర్టు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు సూడి కృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివ, నాయకులు తుమ్మల వెంకటరెడ్డి, రత్నం రాజేందర్, కొప్పుల రఘుపతిరావు, పొదిళ్ల చిట్టిబాబు, వాసు, దావూద్, మల్లారెడ్డి, రాజేష్, ఆగిరెడ్డి, చిరంజీవి, దామోదర్, సౌమ్య, చిన్న, దేవయ్య, నర్సింహచారి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రవికుమార్

ఎస్ఐ వేధిస్తున్నాడు.. ఆత్మహత్యకు అనుమతివ్వండి

- భూపాలపల్లి కలెక్టరేట్ ఎదుట దంపతుల నిరసన
- ఇరు కుటుంబాల మధ్య భూమి వివాదం నేపథ్యంలో ఆందోళన



కలెక్టరేట్ వద్ద సులోచన, ప్రతాప్‌రెడ్డి దంపతులతో మాట్లాడుతున్న భూపాలపల్లి ఆర్డీవో రవి

భూపాలపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా కన్నాయిగూడెం ఎస్సై ఇనగాల వెంకటేశ్ తమను మానసికంగా వేధిస్తున్నాడని, తమకు ఆత్మహత్యే శరణ్యమని, అందుకు తమకు అనుమతినివ్వాలంటూ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం వేములపల్లి గ్రామానికి చెందిన దంపతులు సంది సులోచన, ప్రతాప్‌రెడ్డి ఆందోళన చేశారు. భూపాలపల్లి కలెక్టరేట్ వద్ద సోమవారం వారు నిరసనకు దిగారు. ఆ దంపతులు తెలిపిన వివరాల ప్రకారం... భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం వేములపల్లి గ్రామానికి చెందిన సంది సులోచన, ప్రతాప్‌రెడ్డి దంపతులకు అదే మండలంలోని నర్సింగపూర్ శివారు బండల కుంట చెరువు కట్టకింద సర్వే నెం 30,79, 80లలో 12 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇక నర్సింగపూర్ గ్రామానికి చెందిన ఇనగాల వెంకటేశ్ ప్రస్తుతం ములుగు జిల్లా కన్నాయిగూడెం ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్నాడు. వెంకటేశ్ కుటుంబానికి.. ప్రతాప్‌రెడ్డి భూమి పక్కనే ఎకరం వ్యవసాయ భూమి ఉంది. ఇద్దరి మధ్య చాలా కాలంగా బాట విషయంలో గొడవలు జరుగుతున్నాయి. తమ పొలానికి వెళ్లే బాటను వెంకటేశ్ ఆక్రమించాడంటూ గతంలో హైదరాబాద్ ప్రజాదర్బార్‌లో ప్రతాప్‌రెడ్డి ఫిర్యాదు చేశాడు. దాంతో 2023 డిసెంబరు 27న విచారణ చేపట్టిన అప్పటి ఆర్డీవో రమాదేవి పూర్వపుబాటను పునరుద్ధరించాలని ఉత్తర్వులు వెలువరించారు. కానీ ఎస్సై వెంకటేశ్ మాత్రం ఆ ఉత్తర్వులను ఉల్లంఘిస్తూ తమను భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని ప్రతాప్‌రెడ్డి-సులోచన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాటను పునరుద్ధరించకుండా అడ్డుకుంటున్నాడని తెలిపారు. వెంకటేశ్ నిర్వాకంతో తమకు జీవనోపాధి లేకుండా పోయిందని, తమకు ఆత్మహత్యే శరణ్యమని, అందుకు అనుమతి ఇవ్వాలని వారు భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మను కోరారు. వీరి నిరసన విషయం తెలుసుకున్న భూపాలపల్లి ఆర్డీవో రవి అక్కడికి చేరుకొని వారితో మాట్లాడారు. గతంలో ఆర్డీవో ఆదేశాలు ఎందుకు పాటించడం లేదని మొగుళ్లపల్లి తహసీల్దార్‌ను ఆరా తీశారు. భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావుతో మాట్లాడి బాట వేయకుండా అడ్డుకుంటున్న ఎస్సైపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్డీవో భరోసా ఇవ్వడంతో ఆ దంపతులు నిరసనను విరమించారు.



జాతర హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న పూజారులు, జాతర కమిటీ నిర్వాహకులు

చింతలగట్టు
హుండీ ఆదాయం 1.94 లక్షలు

గూడూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : గూడూరు మండలం చింతలగట్టు వట్టివాగు సమ్మక్క-సారలమ్మ జాతర హుండీలను సోమవారం పూజారులు, జాతర కమిటీ నిర్వాహకులు లెక్కించారు. రూ.1,94,224ల ఆదాయం వచ్చినట్లు పూజారుల కమిటీ అధ్యక్షులు దారం సిద్దు, జాతర కమిటీ అధ్యక్షులు పెనక నాగయ్య తెలిపారు. ఈ లెక్కింపులో కారం లక్ష్మయ్య, ఈసం సహదేవులు, సనుప వీరస్వామి, వాసం భద్రయ్య, నరేష్, సుధాకర్, రమేష్, జనార్దన్, పోతయ్య, వజ్జయ్య, సాంబరాజు, అశోక్, భద్రయ్య, బుచ్చమ్మ పాల్గొన్నారు.



ఎర్రవల్లిలో మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ మంత్రి రెడ్యానాయక్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోతు కవిత, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు

మాజీ సీఎం కేసీఆర్‌ను
కలిసిన బీఆర్ఎస్ నేతలు

మహబూబాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలో రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ వ్యవస్థాపకులు కేసీఆర్‌ను మానుకోట జిల్లాకు చెందిన మాజీ మంత్రి డీఎస్ రెడ్యానాయక్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎంపీ మాలోతు కవిత, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు సోమవారం వేర్వేరుగా మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. మాజీ సీఎం కేసీఆర్‌కు పుష్పగుచ్ఛాలందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తొలుత హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో నిర్వహించిన కేసీఆర్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న అనంతరం ఎర్రవల్లిలో మాజీ సీఎంకు శుభాకాంక్షలు తెలిపారు.

సంఘ అభివృద్ధికి విశేష కృషి

- డోర్నకల్ సీఎస్ఐ బిషప్ పద్మారావు

డోర్నకల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): డోర్నకల్ అధ్యక్ష మండల పరిధిలో ఉన్న చర్చిల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు డోర్నకల్ సీఎస్ఐ చర్చి బిషప్ కోడిరెక్క పద్మారావు అన్నారు. సోమవారం నూతనంగా నిర్మించిన బిషప్ బంగ్లాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భవన నిర్మాణానికి తన సంకల్పంతోపాటు ప్రభు ఆశీస్సులు తోడవ్వడంతో సంవత్సరంలోనే అద్భుతమైన భవనం నిర్మించడం సాధ్యమైందన్నారు.

ఈ కార్యక్రమంలో సీఎస్ఐ మోడరేటర్ రూబిన్ మార్క్, ట్రెజరర్ విశ్వంప్రభాకర్, నాగభూషణం, మోజెస్, నవీన్, సునీల్, శ్రీధర్, సేనం రాజు, రితీష్‌రెడ్డి, శ్రీనివాసరావు, ఇసాక్, విక్రమ్, ఏసుపాదం, పాస్టర్లు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఎస్ఐ చర్చి బిషప్ కోడిరెక్క పద్మారావు

వరంగల్ మార్కెట్ ధరలు
(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2305	2100
పల్లికాయ (సూక)	7200	4600
పల్లికాయ (పచ్చిది)	4100	3100
కందులు	7211	5540
పెసళ్లు	5552	4645
పత్తి	6800	5800
పసుపు (కాడి)	-	-
పసుపు (గోల)	-	-
తేజ మిర్చి	13800	9000
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్	16000	11500
ఎల్లో మిర్చి	-	-
యూఎస్341	13500	11500
దేశీ ఏసీ	-	-
దీపిక	17200	15245
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

ప్రసిద్ధ పర్యాటక స్థలాల సందర్శనకు

ఒక రోజు టూర్

అందుబాటులోకి తెచ్చిన పర్యాటక శాఖ

వివరాలు వెల్లడించిన టూరిజం డీఎం శ్రీనివాసరావు



రామప్ప గుడి

బాలసముద్రం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గల ప్రసిద్ధమైన పర్యాటక స్థలాలను సందర్శించేందుకు టూరిజం శాఖ ఆధ్వర్యంలో ఒక రోజు టూర్ ప్యాకేజీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు టూరిజం శాఖ డిప్యూటీ మేనేజర్ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు హరిత కాకతీయ హోటల్ నుంచి బస్సు బయలుదేరి ముందుగా వేయిస్తంభాల ఆలయం దర్శనం అనంతరం భద్రకాళి అమ్మవారి దర్శనం తరువాత అక్కడి నుంచి ఉదయం 11 గంటలకు బయలుదేరి రామప్ప దేవాలయాన్ని సందర్శించనున్నట్లు తెలిపారు. దర్శనం అనంతరం రామప్పలోని హరిత హోటల్‌లో భోజనం చేసి అక్కడి నుంచి మధ్యాహ్నం 2 గంటలకు లక్నవరం సరస్సును సందర్శించడం జరుగుతుందని తెలిపారు. అక్కడ బోటింగ్ చేయాలనుకునే వారు సొంత ఖర్చులను భరించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. సాయంత్రం 5.30 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌కు వచ్చి టీ తాగిన అనంతరం సాయంత్రం 6 గంటలకు ఖిలా వరంగల్‌లో సౌండ్ అండ్ లైట్ షోను తిలకించిన అనంతరం రాత్రి 8 గంటలకు హరిత కాకతీయ హోటల్‌కు యాత్ర చేరుకుంటుందని తెలిపారు. ఇందుకు గాను పెద్దలకు రూ. 980, పిల్లలకు రూ. 790 చెల్లించవలసి ఉంటుందని తెలిపారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని శ్రీనివాసరావు కోరారు. వివరాల కోసం సెల్ నంబర్ : 9010007261లో సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.



లగ్జరీ బస్సు

పర్యాటకానికి అనువుగా బయ్యారం పెద్దచెరువు

పర్యాటక శాఖ ఉమ్మడి జిల్లా అధికారి శివాజీ



బయ్యారం పెద్ద చెరువు వద్ద శిలాశాసనాన్ని పరిశీలిస్తున్న పర్యాటకశాఖ ఉమ్మడి జిల్లా అధికారి శివాజీ

బయ్యారం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : కాకతీయుల నాటి బయ్యారం పెద్ద చెరువు పర్యాటక ప్రాంతానికి అనువైందని పర్యాటక శాఖ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జ్ శివాజీ అన్నారు. సోమవారం బయ్యారం పెద్ద చెరువును సందర్శించిన ఆయన కట్టపై గల 11వ శతాబ్దంనాటి శిలశాసనాన్ని పరిశీలించారు. అలాగే కట్టపై ఉన్న కట్ట మైసమ్మ, మత్తడి, చెరువు లోతును తెలిపే తూము, చెరువు మధ్యలో ఉన్న ఐలాండ్‌ను పరిశీలించి పర్యాటక అభివృద్ధికి కావాల్సిన అన్ని సదుపాయాల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎకో టూరిజం అభివృద్ధికి అనువైన స్థలంగా గుర్తించి రిసార్ట్‌లు, అతిథి గృహాలు నిర్మిస్తే పర్యాటకులకు ఎంతో దోహదపడుతుందని, తద్వారా జిల్లా పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుందన్నారు. ఆయన వెంట జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి రాజేంద్రప్రసాద్ ఉన్నారు.



'బేటీ బచావో.. బేటీ పడావో' కార్యక్రమాల్లో భాగంగా బాలికలకు సైకిళ్లు అందజేస్తున్న మంత్రి సీతక్క, కలెక్టర్ దివాకర (ఫైల్)

బేటీ బచావో.. బేటీ పడావో'కు పదేళ్లు

వచ్చే నెల 8వరకు ప్రత్యేక కార్యక్రమాలు

బాలికలకు అండగా..

రక్షణ మెండుగా..

వెంకటాపూర్, ఫిబ్రవరి 17, (ఆంధ్రజ్యోతి): లింగ వివక్షను రూపుమాపి, మహిళ సాధికారతను సాధించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం 2015 జనవరి 15న బేటీ బచావో.. బేటీ పడావో (ఆడ పిల్లలను రక్షించడం.. ఆడపిల్లలను చదివించడం) అనే కార్యక్రమాన్ని ప్రారంభించింది. అయితే దీనికి ప్రారంభించి పదేళ్లయిన సందర్భంగా బాలికల సంరక్షణ, స్త్రీ సాధికారిత, లింగ వివక్షకు వ్యతిరేకంగా పౌరులకు విస్తృతంగా అవగహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో జిల్లా సాధికారత కేంద్రాల ఆధ్వర్యంలో గత జనవరి 22 నుంచి ప్రారంభమైన కార్యక్రమాలు మార్చి 8వ తేదీ వరకు కొనసాగనున్నాయి. బాలికల చట్టాలు లింగవివక్ష, విద్యాలయాల్లో గుడ్ టచ్, బ్యాడ్ టచ్.. తదితర అంశాలపై విస్తృతంగా అవగహన కల్పిస్తున్నారు. ఇబ్బందులు ఎదురైతే 181 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు. ఇందుకోసం విద్యాశాఖ అధికారులతో చర్చిస్తున్నారు. అలాగే బాల్య వివహాలు చేసినా, స్త్రీలను లైంగికంగా హింసించినా, వరకట్న వేధింపులకు గురి చేసినా, గర్భంలోనే ఆడపిల్లను అంత మొందించినా.. చట్టపరంగా ఇబ్బందులు తప్పవని హెచ్చరిస్తున్నారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యాబుద్ధులు చెప్పాల్సిన గురువులు బాలికలను బ్యాడ్‌టచ్ చేసినా, ఎలాంటి శిక్ష ఉంటుందనే దానిపై జిల్లా సాధికారత కేంద్రం, లీగల్ సెల్ ఆథారిటీ (న్యాయశాఖ) ఆధ్వర్యంలో అవగహన కార్యక్రమాలు చేపడుతున్నారు. కళాశాలలు, పాఠశాలల్లో తోటి విద్యార్థినిలను లైంగికంగా వేధిస్తే జరగబోయో పరిణామాలు, అందుకు పడే శిక్షల గురించి బాలురకు న్యాయ నిపుణులతో సమగ్రంగా వివరిస్తున్నారు.



ఇటీవల బాలికలకు దుస్తులు పంపిణీ చేస్తున్న మంత్రి, కలెక్టర్, డిడబ్ల్యూవో, ఎస్పీ, ఇతరులు

విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం



'బేటీ బచావో.. బేటీ పడావో' కార్యక్రమం ప్రారంభమై పదేళ్లు పూర్తయిన నేపథ్యంలో మార్చి 8వ తేదీ వరకు వివిధ కార్యక్రమా లను నిర్వహిస్తున్నాం. జిల్లా సాదికారత కేంద్రం ఆధ్వర్యంలో వివిధ శాఖల సమన్వయంతో కళాశాలలు, పాఠశాలలు, కేజీబీవీలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవగహన కార్యక్రమాలు చేపడుతున్నాం. అలాగే లీగల్‌సెల్ ఆథారిటీ ఆధ్వర్యంలో న్యాయమూర్తులతో అవగాహన కల్పిస్తున్నాం.

\- అకిరెడ్డి రమాదేవి, ములుగు జిల్లా మిషన్ కోఆర్డినేటర్

జైళ్ల శాఖ డీజీపీ సౌమ్యమిశ్రాను కలిసిన సీపీ



జైళ్ల శాఖ డీజీపీ సౌమ్యమిశ్రాకి పుష్పగుచ్ఛం అందజేసిన సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం , ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల కోసం సోమవారం హనుమకొండ పోలీస్ గెస్ట్ హౌస్‌కు చేరుకున్న రాష్ట్ర జైళ్ల శాఖ డీజీపీ డాక్టర్ సౌమ్య మిశ్రాను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. వారితో పాటు సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా , ఏఎస్పీ మనన్ భట్, ఏసీపీలు ఉన్నారు.



కేంద్రంలో పాలు పోస్తున్న పాడి రైతులు

జాగ్రత్తలు ఇవి..

పాలు పితికే వ్యక్తి కూడా ఆరోగ్యవంతుడై ఉండాలి. శుభ్రమైన దుస్తులు ధరించాలి. చేతి వేళ్ల గోళ్లను ఎప్పటికప్పుడు కత్తిరించుకోవాలి. చేతులు సబ్బుతో పరిశుభ్రంగా కడుక్కోవాలి. న్యుమోనియా, క్షయ, డీఫ్తీరియా, గజ్జి, తామర, కలరా లాంటి వ్యాధులతో ఉన్నవారు పాలు పితకకూడదు. మశూచి, గాలికుంటు, రేబిస్, దొమ్మ, బ్రూసెల్లోసిస్, పొదుగు వాపు వంటి వ్యాధులు సోకిన పశువుల నుంచి పాలు తీయరాదు. పశువులు ఆరోగ్యంగా ఉండేలా చూసుకోవాలి. ముందు పితికిన పాలల్లో సూక్ష్మజీవులు ఎక్కువగా ఉండి వెన్న శాతం తక్కువగా ఉంటుంది. కాబట్టి ముందు పాలు దూడకు వదలాలి. వెనుక తీసిన పాలను కేంద్రానికి పోయాలి.

లోపాలను అధిగమిస్తే లాభాలు

- పాలు పితకడంలో మెళకువలు పాటించాలి
- పరిశుభ్రత పాటిస్తే మరింత స్వచ్ఛత సాధ్యం

ఖానాపురం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పశువుల నుంచి పితికిన పాలు ఎక్కువ సమయం నిల్వ ఉండాలన్నా, అధిక వెన్న శాతం సాధించాలన్నా శుభ్రత పాటించాలి. అప్పుడే స్వచ్ఛమైన పాలను దూర ప్రాంతాలకు తరలించొచ్చు. పాడి పశువులను పెంచడం వాటి పాలు పితకడం ఓ కళ. మెళకువలను పాటించినప్పుడే పాడి ఉత్పత్తి లాభాల బాట పడుతుంది. నాణ్యమైన పాలను పొందేందుకు మెళకువలు పాటించాలని పశువైద్యులు సూచిస్తున్నారు.

పరిశుభ్రతే ముఖ్యం

పాలు పితికే ముందు పాడి పశువు వెనుక భాగం, తొడలు, పొదుగు, తోక తదితర శరీర భాగాలను శుభ్రంగా కడిగి పొడి గుడ్డతో తుడవాలి. పశువులతో పాటు పాల పాత్రలను కడగటానికి పరిశుభ్రమై నీటిని వినియోగించాలి. పశువులు తాగేందుకు క్లోరినేషన్ చేసిన నీటినే వాడాలి. పాల రంగుపై ప్రభావం చూపే ఖనిజ లవణాలున్న నీటిని అసలు వాడరాదు. పాకలోని మురుగు నీరు ఎప్పటికప్పుడు బయటకు పోయేలా ఏర్పాటు చేసుకోవాలి. పాకలో ఫ్లోరింగ్‌ను పొడిగా, శుభ్రంగా ఉంచుకోవాలి. ఫినాయిల్, డెటాల్ వంటి వాటితో నేలను రోజు శుభ్రం చేసుకోవాలి. ఎలుకలు, బొద్దింకలు, క్రిమి కీటకాలు పాకలోకి చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. బూజు, దుమ్ము లేకుండా పశువుల పాకను ఎల్లప్పుడు శుభ్రం చేసుకోవాలి.. గాలి వెలుతురు బాగా వచ్చే ఎత్తైన ప్రదేశంలో పశువుల పాకను నిర్మించుకోవాలి.

అప్రమత్తంగా ఉండాలి

పచ్చగడ్డిని మేపేటప్పుడు క్రిమిసంహారక మందుల అవశేషాలు, చికిత్స చేసినప్పుడు యాంటి బయాటిక్స్ అవశేషాలు పశువుల శరీరంలో చేరే అవకాశం ఉంది. అలాంటప్పుడు పశువుల నుంచి తీసిన పాలు తాగినవారు ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంది. పచ్చిగడ్డి పెంపకానికి ఎంత తక్కువగా మందులను వాడితే అంత మంచిది. అనవసర మందులను వాడరాదు. రాత్రి పితికిన పాలను, ఉదయం పితికిన పాలను కలపరాదు. అప్పుడే ఈనిన పశువుల పాలను పాల సేకరణ కేంద్రానికి పంపరాదు. గడ్డి పరకలు, క్రిములు, దుమ్ము, ధూళి పడకుండా పాల పాత్రలపై మూత వేసి ఉంచాలి. పాలలో బ్యాక్టీరియా ఎక్కువ వృద్ధి చెందుతుంది. పితికిన తర్వాత రెండు నుంచి మూడు గంటల్లో పాలను పాల సేకరణ కేంద్రానికి పంపించాలి. పాలల్లో ఎరుపు జీర, మరకలు కనిపిస్తే పొదుగు వాపు, గాయమయి ఉండవచ్చు. వెంటనే పశు వైద్యుడిని సంప్రదించాలి.



పాలు పితుకుతున్న రైతు

పాలు నిల్వ ఇలా...

స్టీలు అల్యూమినీయం పాత్రలనే వాడాలి. ఇనుము, రాగి పాత్రలు వాడితే పాలు త్వరగా చెడిపోతాయి. సొట్టలు, గీట్లు పడిన పాత్రలు వాడితే వాటిలో మురికి చేరి పాలు కలుషితమయ్యే ప్రమాదముంది. పాత్రలను నిత్యం రెండు పూటలా తోమాలి. వాషింగ్ సోడా కలిపిన వేడి నీటిలో కడిగి ఎండలో ఆరబెడితే మంచిది. వెచ్చటి వాతావరణంలో సూక్ష్మజీవులు బాగా వృద్ధి చెంది పాలలోని చెక్కరను ఆమ్లంగా మార్చుతాయి. ఫలితంగా పాలు త్వరగా చెడిపోతాయి. పాలను నిల్వ చేయడానికి తినే సోడా, దుస్తుల సోడాలను కలుపరాదు. పాలలో నీళ్ల కలుపడం వల్ల వెన్న శాతంతో పాటు మిగిలిని ఘన పదార్థాలూ తగ్గిపోతాయి. దీంతో పాల రేటు కూడా తగ్గిపోతుంది. చుట్టు పక్కలగల వాసనను పాలు వెంటనే గ్రహిస్తాయి. కాబట్టి ఉల్లి, వెల్లుల్లి, ఎండు చేపల వాసన, మురుగునీటి వాసన వస్తే పాలు ఆ వాసనను గ్రహించి పులిసిన వాసన పాలకు వస్తుంది. పాలు పితికిన వెంటనే పరిశుభ్రమై వస్త్రంతో వడకట్టాలి. రాత్రి తీసిన పాలతో తాజా పాలు కలపరాదు. తాజా పాలు కొంచెం తియ్యటి వాసన కలిగి ఉంటాయి.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏసీ సునీత, గంగు ఉపేంద్రశర్మ

25 నుంచి రుద్రేశ్వరాలయంలో

శివరాత్రి వేడుకలు

పోస్టర్ ఆవిష్కరణలో దేవాదాయ శాఖ ఏసీ సునీత

హనుమకొండ కల్చరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో మహాశివరాత్రి పర్వదిన వేడుకలను పెట్టింది పేరైన చారిత్రక వేయిస్తంభాల ఆలయంలో ఈ నెల 25 నుంచి మార్చి 1వ తేదీ వరకు వైభవంగా మహా శివరాత్రి పర్వదిన వేడుకలను దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు దేవాదాయ శాఖ ఉమ్మడి జిల్లా సహాయ కమిషనర్ రామల సునీత చెప్పారు. ఆలయ కల్యాణ మండపంలో శివప్రీతికర సోమవారం ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ, హనుమకొండ పోలీస్ ఇన్‌స్పెక్టర్ సతీష్‌లతో కలిసి శివరాత్రి వేడుకల గోడ పత్రికను ఆమె ఆవిష్కరించారు. దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశానుసారం వేయిస్తంభాల ఆలయ మహాశివరాత్రి ఉత్సవాలకు స్పెషల్ అధికారిగాను నియమితులైన సునీత ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ. జిల్లా యంత్రాంగం, నగర పాలకసంస్థ, పోలీసు, ఆర్ అండ్ బీ తదితర శాఖల సమన్వయంతో ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆమె చెప్పారు. ఆలయానికి లక్షలాదిగా తరలివచ్చే భక్తులు ఇబ్బందులు పడకుండా ప్రత్యేక క్యూలైన్‌లతోపాటు మంచినీటి సౌకర్యం, జాగరణ ఉండే భక్తుల కోసం నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రత్యేక వేదిక ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె చెప్పారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో జాగరణ ఉండే భక్తులకు పండ్లు, ప్రసాదాలు వితరణ చేస్తామన్నారు. మహాశివరాత్రి పర్వదిన వేళ లింగోద్భవ కాలంలో చాలా ప్రాముఖ్యత కలిగిన ఈ సమయంలో వేద పండితుల ఆధ్వర్యంలో మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు నిర్వహిస్తామన్నారు. 25వ తేదీన ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనంతో మహాశివరాత్రి వేడుకలను శ్రీకారం చుడుతామని ఇదే క్రమంలో 26వ తేదీ శివరాత్రి వేళ రుద్రేశ్వర కల్యాణం, 27న నగవెల్లి సదస్యం, 28న స్వామివారికి మహా అన్నపూజ, మార్చి 1వ తేదీన ఆంజనేయస్వామికి చందనోత్సవం, ఆకుపూజ, మహా పూర్ణాహుతి, పుష్పార్చనలు నిర్వహిస్తామన్నారు. శివరాత్రి వేళ స్వామి వారి కల్యాణంలో పాల్గొనే భక్తులు రూ.1116 చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ చెప్పారు. జాగరణ ఉండే భక్తుల కోసం ఈసారి ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నా రు. పోలీసు అధికారి సతీష్ మాట్లాడుతూ. ఆలయానికి పెద్దఎత్తున తరలివచ్చే భక్తులకు శీఘ్ర దర్శనం కల్పించేందుకు మూడంచల వ్యవస్థతో పటిష్ట భద్రతా, మహిళా భక్తుల కోసం ప్రత్యేకంగా మహిళా కానిస్టేబుళ్ల ను ఏర్పాటు చేస్తామన్నారు. ట్రాఫిక్‌ను కూడా క్రమబద్ధీకరించను న్నట్లు చెప్పారు. ఆలయ సిబ్బంది మధుకర్, రామకృష్ణ, రజిత తదితరులు పాల్గొన్నారు. వేయిస్తంభాల ఆలయంలో మహాశివరాత్రి వేడుకల ఏర్పాట్ల గురించి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, దేవాదాయ శాఖ అధికారులతో జరిగిన ప్రత్యేక సమావేశంలో కూడా పోస్టర్ ఆవిష్కరించారు.

మడికొండ : మహాశివరాత్రి ఉత్సవాలను జయప్రదం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య పిలుపునిచ్చారు. ఓరుగల్లు మహానగరంలో అతి ప్రాచీనమైన దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న శ్రీమెట్టు రామలింగేశ్వరాస్వామి, శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానంలో ఈనెల 24నుంచి మార్చి 4 వరకు నిర్వహించే మహా శివరాత్రి ఉత్సవాల వాల్ పోస్టర్‌ను సోమవారం జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్ర మంలో కార్యనిర్వాహణాధికారి కె. శేషు భారతి, శివాలయం చైర్మన్ పైడిపాల రఘుచందర్, అర్చకులు రాగిచేడు అభిలాష్ శర్మ, హనుమకొండ ఆర్‌డీవో రమేష్ రాథోడ్, దేవాదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ సునిత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు


కేసీఆర్ జన్మదిన కేక్‌ను కట్ చేస్తున్న రాంమోహన్‌రెడ్డి


కేసముద్రంలో మాట్లాడుతున్న శంకర్‌నాయక్


ఆస్పత్రిలో పండ్లు, బ్రెడ్‌ల పంపిణీ


తొర్రూరు కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. అన్ని మండల కేంద్రాల్లో కేక్ కట్ చేసి, మొక్కలను నాటారు. మహబూబాబాద్ పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన కేక్‌ను కట్ చేశారు. అనంతరం మొక్కను నాటారు. బీఆర్ఎస్ నాయకులు పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, మార్నేని వెంకన్న, యాళ్ల మురళీధర్ రెడ్డి, నాయిని రంజిత్, ముత్యం వెంకన్న, సలీం, చిదిరాల శరత్, లూనావత్ అశోక్‌నాయక్, కొండపల్లి కరుణాకర్‌రెడ్డి, బోడ లక్ష్మన్, నీలేష్‌రాయ్, నల్లాని నవీన్‌రావు, మార్నేని రఘు, కిరణ్, కర్పూరపు గోపి పాల్గొన్నారు.

● జిల్లా ఆస్పత్రిలో మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ నేతృత్వంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, మార్నేని వెంకన్న, పీఏసీఎస్ చైర్మన్ నాయిని రంజిత్, యాళ్ల మురళీధర్‌రెడ్డి, లూనావత్ అశోక్‌నాయక్, దామునాయక్, గోగుల రాజు, నర్సింహానాయక్, శరత్ పాల్గొన్నారు.

వివిధ మండలాల్లో..

● కేసీఆర్ జన్మదినం సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు మరిపెడ పీహెచ్‌సీలో రోగులకు పండ్లు, పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గందసిరి కృష్ణ, అజ్మీరా రెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.

● సీరోలులో బీఆర్ఎస్ పార్టీ అధినేత,మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బోజ్యనాయక్, గోపయ్య, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

● డోర్నకల్ గాంధీ సెంటర్‌లో బీఆర్ఎస్ కార్యకర్తలు కేసీఆర్ జన్మదిన కేక్ కట్ చేశారు. అనంతరం పులహోర ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ బిక్షంరెడ్డి, మానుకోట మాజీ ఏఎఫ్‌సీ చైర్మన్ కత్తెరసాల విద్యాసాగర్, బాలునాయక్, యశోదర్, అజిత్‌మియా, పోడు జనార్దన్, ఇంజం కృష్ణయ్య, మన్మదరావు, సతీష్ పాల్గొన్నారు.

● తొర్రూరులో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు సీఎం కేసీఆర్ జన్మదిన కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. మాజీ జడ్పీటీసీ మంగళంపల్లి శ్రీనివాస్, డాక్టర్ సోమేశ్వర్‌రావు, టీసీ అంజయ్య, శ్రీనివాస్, కుర్ర శ్రీను, ప్రదీప్‌రెడ్డి, ఆశయ్య, జయ్‌సింగ్, నాగరాజు పాల్గొన్నారు.

● కురవి దేవాలయ సెంటర్‌లో మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన కేక్‌ను టీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు గుగులోతు రవినాయక్ కట్ చేసి పంపిణీ చేశారు.మండల పార్టీ అధ్యక్షులు తోట లాలయ్య, బాదావత్ రాజునాయక్, గాడిపల్లి రాములు, కిశోర్‌రాజు, బోడ శ్రీను, దుడ్డెల వినోద్, సీహెచ్. భాస్కర్, బండి యతిరాజ్, కిన్నెర మల్లయ్య, కాట్యాల వీరన్న పాల్గొన్నారు.

● కొత్తగూడ మండలం గుంజేడు ముసలమ్మ జాతర వద్ద కేసీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు వేణు, అధికార ప్రతినిధి నెహ్రూ, నాయకులు వెంకన్న, శ్రీను, కిషన్ పాల్గొన్నారు.

● ఇనుగుర్తిలో బీఆర్ఎస్ మాజీ సీఎం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేశారు. బేతమల్ల చంద్రయ్య, దీకొండ వెంకన్న, దార్ల రాంమ్మూర్తి, పింగిలి శ్రీనివాస్, గుండ్రపల్లి దేవేందర్, బూర రజినీకాంత్, నాగెల్లి మురళీ, మంగ్యా, శ్రీనివాస్ పాల్గొన్నారు.

● బయ్యారంలో బీఆర్ఎస్ నేతలు మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు తాత గణేష్‌తో పాటు నాయకులు సత్యనారాయణ, శ్రీను, రసూల్, శివాజీ, మురళీకృష్ణ, రాము, వీరన్న పాల్గొన్నారు.

● పెద్దవంగరలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈదురు ఐలయ్య, శ్రీరాం సంజయ్, పాకనాటి సునీల్‌రెడ్డి, కునుకుంట్ల వెంకన్న, ఎర్ర వెంకన్న, కుమారస్వామి, శ్రీను, వేణు, రాము, అనిల్ పాల్గొన్నారు.

● కేసముద్రం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ సీఎం కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ కేక్ కట్ చేసిన అనంతరం అన్నదానం నిర్వహించారు. మాజీ ఎంపీపీ వోలం చంద్ర మోహన్, నీలం దుర్గేష్, ఎండీ.నజీర్‌అహ్మద్, కముటం శ్రీనివాస్, చింతనూరి వెంకన్న, మోడెం రవీందర్‌గౌడ్, గుగులోత్ వీరునాయక్, సట్ల వెంకన్న, కొండ్రెడ్డి రవీందర్‌రెడ్డి, దార్ల రాంమూర్తి పాల్గొన్నారు.

● నెల్లికుదురు :మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యలయంలో సోమవారం కేసీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్‌చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పరిపాటి వెంకట్‌రెడ్డి కాసం వెంకటేశ్వర్‌రెడ్డి, ఆదిరెడ్డి, పులి రామచంద్రు, వెన్నాకుల శ్రీనివాస్, వీరగాని మల్లేశంగౌడ్, గుండ్ల వెంకన్న, కస్త్రబోయిన విజయ్‌యాదవ్, మంద అశోక్ పాల్గొన్నారు

● గూడూరు మండలంలో బలోపేతం చేసేందుకు కార్యకర్తలు శక్తివంచన లేకుండ కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు బీరవెల్లి భరత్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. గూడూరు బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన కేక్‌ను కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు వేం వెంకటకృష్ణారెడ్డి, మాజీ జడ్పీ జిల్లా కోఆప్షన్ సభ్యులు మహ్మద్ ఖాసీం, నాయకులు ఆరె వీరన్న, నూకల సురేందర్, కటార్‌సింగ్, సంపత్‌రావు, బోడ కిషన్ పాల్గొన్నారు.

బీసీల సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం

కేసముద్రం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) :రాష్ట్రంలోని బీసీలకు రాజకీయ, విద్య, ఉద్యోగ రంగాల్లో సరైన రిజర్వేషన్ కల్పించేందుకు కులగణన చేపట్టి వారి సంక్షేమం కోసం సీఎం రేవంత్‌రెడ్డి సారధ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని కాంగ్రెస్ ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడు చిట్ల సంపత్ అన్నారు. కేసముద్రంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 18 నుంచి 28 వరకు నిర్వహించే కులగణనలో మిగిలిన అన్ని కులాల వారు తమ వివరాలను అందించాలని కోరారు. ఆయన వెంట యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గొల్లపల్లి మహేందర్‌గౌడ్, బీసీ నాయకులు ముదిగిరి సాంబయ్య, తరాల వీరేష్, సామల నర్సయ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు రెమ్యూనరేషన్ చెల్లించాలి

గూడూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : కుల గణనలో పాల్గొన్న ఉపాధ్యాయులకు రెమ్యూనరేషన్‌తో పాటు పేస్కేల్‌ను మంజూరు చేయాలని డీటీఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు బోడ దూప్‌సింగ్, ఇస్లావత్ చందా డిమాండ్ చేశారు. గూడూరు ఎమ్మార్సీలో సోమవారం ఎంఈవో రవికుమార్‌కు వినతిపత్రం అందించారు. మంగీలాల్, మల్లారెడ్డి, గుంటి శ్రీనివాస్, హరిశంకర్ పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) :ఆపదలో ఉన్న వారికి రక్తదానం ప్రాణదాతలుగా నిలువాలని ప్రిన్సిపాల్ లక్ష్మన్‌నాయక్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్‌లోని నూకల రాంచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం రెడ్‌రిబ్బన్ క్లబ్, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు హితేష్, ఖాసింషా, శ్రీనివాసులు, అన్నపూర్ణ, శ్రీనివాస్, మసూద్ అహ్మద్, సాంబశివరావు, అనిల్‌కుమార్, రాజశేఖర్, హతిరామ్, సుమన్, వీరు, సుమలత, ప్రభావతి, ఉదయ్‌కుమార్, నరేష్ కిరణ్‌కుమార్, వెంకన్న పాల్గొన్నారు.

అమినాపురంలో స్వయంపాలన


సిటిజన్స్ స్కూల్లో స్వయం పాలనలో పాల్గొన్న చిన్నారి విద్యార్థులతో ఉపాధ్యాయులు

కేసముద్రం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) :కేసముద్రం మునిసిపాలిటీ పరిధి అమినాపురం లిటిల్ సిటిజన్ యూపీ స్కూల్‌లో కరస్పాండెంట్ రాయిలి శకుంతల ఆధ్వర్యంలో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. హెచ్ఎంగా కె.వర్షిని, కరస్పాండెంట్‌గా పి.శ్రీశంత్, ఎంఈవోగా బి.ఉత్తేజ్‌వర్ష్, డీఈవోగా ఎస్.ఆదిత్య, చిన్నారులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు.

బీసీవాదాన్ని ఐక్యంగా గెలిపించుకోవాలి

కురవి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : బీసీలంతా ఐక్యంగా ఉండి బీసీ వాదాన్ని గెలిపించుకోవాలని, బీసీల ఓట్లు బీసీలకే వేసుకో వాలని హింధు మహాసభ వ్యవస్థాపకులు బత్తుల సిద్దేశ్వర్ అన్నారు. బీసీ సమరయోధుల గ్రామాలను కలుపుతూ.. హైదరాబాద్ గొల్కోండ కోట నుంచి వరంగల్ కోట వరకు 800 కిలోమీటర్లు పాదయాత్ర చేసిన సిద్దేశ్వర్ సోమవారం కురవి ఆలయాన్ని సం దర్శించారు. ఈ సందర్భంగా బీసీ నాయకులు కొండబత్తుల యాదగిరి, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ పరికిపండ్ల అశోక్ ఘన స్వాగతం పలికారు. అనంతరం బీసీల దళపతి సాంబశివరావు రచించిన బీసీ మెనిఫెస్టో పుస్తకాన్ని ఆయన ఆవిష్క రించారు. దుబ్బకోటి ఆంజనేయులు, తిరుపతి, మహేష్ పాల్గొన్నారు.

గూడూరుకు ముగ్గురు

ఉపాధ్యాయుల కేటాయింపు


నియామకపత్రాలు అందిస్తున్న ఎంఈవో

గూడూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): 2008 డీఎస్సీ ద్వార నియామకమైన ముగ్గురు ఉపాధ్యాయులను గూడూరు మండలానికి కేటాయించినట్లు ఎంఈవో జె.రవి కుమార్ సోమవారం తెలిపారు. వీరిలో శోభన్‌బాబు, యుగంధర్‌లను చర్లతండ ప్రభుత్వ పాఠశాలకు, మరో ఉపాధ్యాయుడిని పొనుగోడు శివారు రాములుతండాకు కేటాయించినట్లు చెప్పారు. ఈ మేరకు వారికి నియామకపత్రాలు అందించినట్లు పేర్కొన్నారు.

ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కాంగ్రెస్‌దే విజయం

డోర్నకల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) :త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచందర్ నాయక్ అన్నారు. సోమవారం డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలోని దివంగత సీఎస్ఐ మాజీ ట్రెజరర్ ఎడ్విన్‌రావు ఇంటి వద్ద సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కార్యకర్తలు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు. మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్ మాట్లాడుతూ.. డోర్నకల్ రైల్వే జంక్షన్ అభివృద్ధికి రూ.20 కోట్లు మంజూరు చేయించినట్లు చెప్పారు. డోర్నకల్ రైల్వేస్టేషన్‌లో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో డోర్నకల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కాల సుమీర్‌చంద్‌జైన్, మునిసిపల్ మాజీ చైర్మన్ వాంకుడోతు వీరన్న, ఏఎంసీ డైరెక్టర్ సాదనాల వెంకటేశ్వర్లు, నాయకులు మాద శ్రీనివాస్, మామిడి నాగరాజు, బద్దునా యక్ పాల్గొన్నారు.


ఎడ్విన్‌రావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న రాంచందర్‌నాయక్, బలరాంనాయక్

● ఎడ్విన్‌రావు కుటుంబానికి పరామర్శ.

డోర్నకల్ సీఎస్ఐ ట్రెజరర్‌గా విశిష్ట సేవలందించిన దివంగత ఎడ్విన్‌రావు కుటుంబాన్ని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచందర్‌నాయక్, ఎంపీ పోరిక బలరాంనాయక్, వరంగల్ మాజీ ఎంపీ రామసహాయం సురేందర్ రెడ్డిలు పరామర్శించారు. సీఎస్ఐ ట్రెజరర్‌గా పనిచేస్తూనే కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి ఎడ్విన్‌రావు కృషి చేశారని చెప్పా రు. అనంతరం ఎడ్విన్‌రావు కుటుంబ సభ్యులైన ఎడ్వాడ్ మోజెస్, ఎడ్మాడ్, ఎర్నెస్ట్, స్టెల్లాను పరామర్శించారు.

ఆనకట్ట నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

చిన్నగూడూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఉగ్గంపల్లి, చిన్నగూడూరు గ్రామాల మధ్య ఉన్న ఆకేరుపై 1964లో నిర్మించిన ఆనకట్ట గతేడాది భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. ఆనకట్ట పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రాంచంద్రునాయక్‌ను మరిపెడ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర నాయకులు డీఎస్ వెంకన్న నాయక్, సీపీఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు ఎడ్లమల్లయ్య సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. నిధుల మంజూరు విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు వెంకన్న తెలిపారు.

ఓబీసీ సెల్ జాతీయ చైర్మన్

అజయ్‌సింగ్‌ను కలిసిన మేకల వీరన్న

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో కాంగ్రెస్ ఓబీసీ సెల్ జాతీయ చైర్మన్ అజయ్‌సింగ్‌ను సోమవారం టీపీసీసీ ఓబీసీ సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల వీరన్న మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. హైదరాబాద్ గాంధీభవన్‌లో కాంగ్రెస్ ఓబీసీ విభాగం కార్యనిర్వాహక సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన అజయ్‌సింగ్‌కు శంషాబాద్ విమాన శ్రయంలో ఓబీసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల వీరన్న ఘన స్వాగతం పలికారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

మాధవపురం గ్రామాభివృద్ధికి కృషిచేస్తా

● మాజీ ఎంపీ సురేందర్‌రెడ్డి

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మాధవపురం గ్రామాభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తానని సీనియర్ రాజకీయ వెత్త, మాజీ ఎంపీ రామసహాయం సురేందర్ రెడ్డి అన్నారు. మహబూబాబాద్ మండలం మాధవపురం గ్రామంలో తన సొంత ఖర్చులతో నిర్మించే ముత్యాలమ్మగుడి నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ.... తన సొంత గ్రామం మాధవపురను రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులు మాలోతు నెహ్రూనాయక్, మద్ది వెంకట్‌రెడ్డి, నూకల రాజేందర్, బంటు అంజయ్య, నూకల రవి, రాంరెడ్డి, వెంకన్న, సురేష్ పాల్గొన్నారు.


ముత్యాలమ్మగుడి శంకుస్థాపన కార్యక్రమానికి హాజరైన మాజీ ఎంపీ సురేందర్‌రెడ్డి

కర్పూరి ఠాగూర్ ఆశయ సాధనకు పాటుపడాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : భారతరత్న బిహార్ మాజీ ముఖ్యమంత్రి, బీసీ నాయకుడు కర్పూరి ఠాగూర్ ఆశయ సాధనకు పాటుపడాలని సామాజిక అధ్యయన వేదిక అధ్యక్షుడు, పార్నంది రామయ్య అన్నారు. మహబూబాబాద్‌లోని నలంద డిగ్రీ కళాశాలలో సోమవారం భారతరత్న, బీసీ నాయకుడు కర్పూరి ఠాగూర్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ కె.బి.శంకర్, కృష్ణారావు, అధ్యాపకులు ప్రసాద్, రవిశంకర్ పాల్గొన్నారు.

అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి

తొర్రూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలంగాణ ఇంటర్ విద్యాశాఖ డైరెక్టర్ కృష్ణ ఆదిత్య అన్నారు. సోమవారం తెలంగాణ ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ లెక్చరర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగటి నారాయణ హైదరాబాద్‌లోని కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు. ప్రభుత్వం అధ్యాపకుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తుందని ఆందోళన చెందవద్దన్నారు. విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఇంటర్ ఫలితాల్లో మానుకోట జిల్లాను ప్రథమ స్థానంలో ఉంచాలన్నారు. రవి, జనార్దన్, సోమేశ్వర్ పాల్గొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యేకు సన్మానం

మరిపెడ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : పీఏసీఎస్‌ల పదవికాలం ఆర్నెళ్లు పెంచినందున మరిపెడ పీఏసీఎస్ పాలకవర్గ బాధ్యుడు చాపల యాదగిరిరెడ్డి ఆధ్వర్యంలో ఎంపీ బలరాంనాయక్, ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్‌ను సోమవారం మరిపెడలో సన్మానించారు. సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు వంటికొమ్ము యుగేంధర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీర్‌రెడ్డి పాల్గొన్నారు.

శంకర్‌నాయక్ వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు శంతన్‌రామరాజు

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీ నాయక్‌ను రాజీనామా చేసి మళ్లీ గెలవాలని మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ చేసిన వ్యాఖ్యలు హాస్య స్పదంగా ఉన్నాయని, ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని కాంగ్రెస్‌పార్టీ జిల్లా నాయకులు శంతన్ రామరాజు అన్నారు. ఒక సారి ప్రజలచేత ఎన్నుకోబడ్డ ప్రజాప్రతినిధి ఐదేళ్లు కొనసాగుతారని మళ్లీ రాజీనామా చేసి గెలవనడంలో అర్థం లేదన్నారు. మహబూబాబాద్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో శంతన్ మాట్లాడుతూ..నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్న మురళీనాయక్‌కు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేకనే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్ గుడి నిర్మాణం పేరుతో రాజకీయం చేయడం తగదన్నారు. ఈ సమావేశంలో కమ్మగాని కృష్ణమూర్తి, కోల సత్యం, గోనె శ్యాంరావు, అల్వాల లాలయ్య, బండి శ్రీహరి, వెంగల్, శంకర్, కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో పీఆర్టీయూ-టీఎస్ ముందంజ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్-తెలంగాణ స్టేట్ (పీఆర్టీయు-టీఎస్) ముందుంటుందని మాజీ ఎమ్మెల్సీ భట్టాపురం మోహన్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్‌లోని సంఘం జిల్లా అధ్యక్షుడు సంకా బద్రి నారాయణ నివాసంలో సోమవారం విలేక రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. సంఘం ఏర్పడిన నాటి నుంచి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తున్నామని తెలిపారు. ఈ నెల 27న జరగనున్న నల్గొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పింగిళి శ్రీపాల్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు రాఘవరెడ్డి, మహేందర్‌రెడ్డి, మిర్యాల సతీష్‌రెడ్డి, గీత, కళ్లెం వెంకట్‌రెడ్డి, రాంజీనాయక్, సుజాత, ఉమాదేవి, గాయత్రి, శంకర్‌నాయక్, కీర్తనారెడ్డి, చిట్టిబాబు, నాగరాజు, కిషన్‌నాయక్, సుశీల పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి

ఆరు గ్యారంటీలను అమలు చేయాలి

నెల్లికుదురు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఆరు గ్యారంటీలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఇసంపెల్లి సైదులు తెలిపారు. మండల కేంద్రంలోని విశ్రాంతి భవనంలో సోమవారం ఆయన మాట్లాడుతూ మహిళలకు రూ. 2500లు, కళ్యాణలక్ష్మీకి తులం బంగారం, రైతుబరోసా, రేషన్ కార్డులు అసంపూర్తిగా అముల చేయడంతో ప్రజలు ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు. ఆరుగ్యారంటీలు పూర్తిస్థాయిలో అమలు చేయకుంటే ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో పెరమాండ్ల బాబుగౌడ్, భూక్య బిచ్చానాయక్, లింగన్న, వెంకన్న పాల్గొన్నారు.

నెల్లికుదురులో సీఐ సర్కిల్ ఏర్పాటు చేయాలి

నెల్లికుదురు ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో సీఐ సర్కిల్ ఏర్పాటు చేయాలని బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి గుగులోత్ మధన్‌లాల్ కరీనగర్‌లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కి సోమవారం వినతిపత్రం అందజేశారు. నెల్లికుదురు, ఇనుగుర్తి కేసముద్రం మండలాల పరిదిలోని నెల్లికుదరులో సీఐ సర్కిల్ ఏర్పాటు చేస్తే అనుకూలంగా ఉంటుందన్నారు. పోలీస్టేసన్‌లో పోలీస్‌సిబ్బంది క్వార్టుర్సు శిథిలావస్థకు చేరుకున్నాయని మరమ్మతులు చేయాలని కోరినట్లు తెలిపారు.

మీ సేవ కేంద్రాల్లో పన్నులు చెల్లించాలి

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ మునిసిపల్ పరిధిలో ట్రేడ్ లైసెన్సులు, ఆస్తి, నల్లా పన్నులు మీ సేవా కేంద్రాల్లో లేదా బిల్లు కలెక్టర్లకు చెల్లించాలని కమిషనర్ నోముల రవీందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొంతమంది వ్యక్తులు మునిసిపల్ కమిషనర్ పేరిట ఫేక్‌కాల్స్ చేసి ట్రేడ్ లైసెన్స్‌లు చెల్లించాలని ఫోన్‌పే, గూగూల్ పే చేయాలని బెదిరిస్తున్నట్లు మునిసిపల్ కార్యాలయ దృష్టికి వచ్చిందని చెప్పారు. బిల్ కలెక్టర్లకు, లేదా మీ సేవా కేంద్రాల్లో చెల్లించి రశీదులు పొందాలని చెప్పారు.

చలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరణ

కేసముద్రం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) :హైదరాబాద్‌లో ఈనెల 20న సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో నిర్వహించే భారీ నిరసన ప్రదర్శన, సభను విజయవంతం చేయాలని కోరుతూ కేసముద్రంలో సోమవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆ పార్టీ నాయకులు విడుదల చేశారు. ఈనెల 20న సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సబ్‌డివిజన్ నాయకుడు బొమ్మగాని వెంకన్న, మిట్టగడుపుల వెంకన్న, పిన్నోజు చంద్రమౌళి, బండి రాజు, మేకల రాజు, అల్లం వెంకన్న, ఉప్పలయ్య, బండారి యాకన్న, రాజు పాల్గొన్నారు.

ప్రింటర్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడిగా నీలం రాజు


నీలం రాజు

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ ప్రింటర్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడిగా నీలం రాజు ఎన్నికయ్యారు. మహబూబాబాద్ పట్టణంలో సోమవారం ప్రింటర్స్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు సమావేశమై నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా నక్క నాగార్జున, కోశాధికారిగా జంగాల వెంకటేష్, గౌరవ సలహాదారులుగా ఎడ్ల ఉప్పలయ్య, కన్న అశోక్‌బాబు, ఉపాధ్యక్షుడిగా అనుముల శ్రీనివాసాచారి, సహాయ కార్యదర్శిగా రంగు సురేష్, కార్యవర్గసభ్యులుగా తునికి యాకయ్య, కొలగాని ప్రభాకర్, చిట్టిమల్ల శ్రీధర్ ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో బల్లెం శ్రీనివాస్, గుగులోతు వెంకన్న, బొడ్ల రామకృష్ణ, పొడకంటి రాజు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కురవి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) :కురవి మండలం అయ్యగారిపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని కురవి, అయ్యగారిపల్లి, నల్లెల్ల, తిరుమలాపురం, చింతపల్లి గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ శారద సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

దొంగతనం కేసులో ఒకరికి ఏడాది జైలు

చిన్నగూడూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఉగ్గంపల్లి పరిధిలోని దేవోజీతండాకు చెందిన ధర్మసోత్ భూపాల్‌నాయక్ ఇంట్లో దొంగతనానికి ప్రయత్నించిన నిందితుడిపై చిన్నగూడూరు పోలీస్‌స్టేషన్‌లో 2023లో కేసు నమోదైంది. సోమవారం తొర్రూరు మేజిస్ట్రేట్ సరిత విచారణ చేసి గుర్రంపూడి మండలం తేనేపల్లికి చెందిన శివర్ల కోటేష్‌కు ఒక సంవత్సరం జైలు శిక్ష, రూ. 1000 జరిమానా విధించినట్లు ఎస్సై రఘూస్సీ తెలిపారు. ఈ కేసును వాదించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ రేవతిదేవి, కోర్టు పీసీ మధును డీఎస్పీ కృష్ణ కిశోర్, సీఐ రాజ్‌కుమార్, ఎస్సై రఘూస్సీ అభినందించారు.

బయ్యారంలో లింగమంతుని జాతర

బయ్యారం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : బయ్యారం పాకాల ఏటి ఒడ్డున ఉన్న పెద్దగట్టు లింగమంతుని ఆలయం నందు లింగమంతుని జాతర వైభవంగా జరిగింది. అంతకుముందు యాదవులు ఆదివారం రాత్రి బయ్యారం గ్రామం నుంచి మేళతాళాల నడుమ గజ్జెల నెక్కర్లు వేసుకుని ఓ లింగా .. ఓ లింగా అంటూ నామస్మరణ చేస్తూ పెద్ద ఎత్తున తరలివెళ్లారు. సోమవారం తెల్లవారుజామున ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

కల్వల ఉన్నత పాఠశాలకు పుస్తకాల వితరణ

కేసముద్రం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని కల్వల జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రవేశపరీక్షలకు, ప్రాథమిక పాఠశాలలో చిన్నారి విద్యార్థులకు ఉపయోగపడే రూ.6300 విలువైన పుస్తకాలను నేషన్స్ ఫస్ట్ హ్యూమన్ చైన్(ఎన్ఎఫ్‌హెచ్‌సీ) ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం అందజేశారు. సుమన్, చంద్రశేఖర్, హెచ్ఎం బండారు నరేందర్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి


అడిషనల్ కలెక్టర్ వీరబ్రహ్మాచారికి వినతిపత్రం అందజేస్తున్న కిసాన్ పరివార్ సంస్థ ప్రతినిధులు

నెహ్రూసెంటర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉన్న పాఠశాలల్లో మౌళిక వసతులు కల్పించాలని కిసాన్ పరివార్ సంస్థ సీఈవో డాక్టర్ వివేక్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ వీరబ్రహ్మాచారికి సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కిసాన్‌పరివార్ సంస్థ సీఈవో వివేక్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గుగులోతు భీమానాయక్, శివవర్మ, విష్ణు పాల్గొన్నారు.